క్లుప్తంగా

ఢిల్లీ ధర్నాలో గూడూరు నాయకులు



వైఎస్.జగన్‌తో ఊటుకూరు మహేంద్రరెడ్డి

గూడూరు రూరల్: రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో ధర్నా చేశారు. ఇందులో గూడూరుకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జగనన్న సేవా సమితి అధ్యక్షుడు ఊటుకూరు మహేంద్రరెడ్డి, మరో ఆరుగురు పాల్గొన్నారు. రాష్ట్రంలో 45 రోజులుగా జరుగుతున్న దమన కాండపై నిరసన తెలిపారు.

ఘనంగా యల్లమ్మ జాతర

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట మండలం పేర్నాడు గ్రామంలో వెలసిన యల్లమ్మ జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అరుణ, మనేముత్తేరి సర్పించ్ చిన్నరాజా, అల్లూరు రమేష్‌రెడ్డి, చిలకా యుగంధర్, బద్దెపూడి మోహన్‌రెడ్డి, చిలక సురేష్, దొరరెడ్డి, అయితా శ్రీధర్, కాకి శ్రీరామమూర్తి, సురేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



వెంకటరత్నంను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రాపూరు: ఇక్కడి నుంచి గుంటూరుకు బదిలీ అయిన తహసీల్దార్ వెంకటరత్నంను బుధవారం రెవెన్యూ సిబ్బంది, మండల కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు ఘనంగా సన్మానించారు. ఎన్నికల సమయంలో సక్రమంగా విధులు నిర్వహించి అందరి మన్నలు పొందారని కొనియాడారు.

సచివాలయాల తనిఖీ

వాకాడు: మండలంలోని పలు సచివాలయాలను బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. వాకాడు-1, వాకాడు-2, కొండాపురం, నెల్లిపూడి గ్రామ సచివాలయాల సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుర్రం జాషువాకు నివాళి



గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వక్తలు

వెంకటగిరి రూరల్: కవి గుర్రం జాషువా వర్ధంతిని బుధవారం వెంకటగిరి పట్టణం తూర్పువీధిలో ఉన్న గ్రంథాలయంలో ప్రజాసాహితి పాఠకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ ఆయన రాసిన రచనలు, ఆయన గొప్పతనాన్ని వివరించారు. టీకే ప్రసాద్, పెనుబాకు వేణు, వీవీ రమణయ్య, సూర్యప్రకాష్, చింతపట్ల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



తన్నమాలలో మహిళలకు గుడ్డ సంచులు అందజేస్తున్న సంఘం సభ్యులు

నాయుడుపేట టౌన్: ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి ముప్పు కలుగుతుందని, ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని జై భారత్ సంస్థ ప్రతినిధి పిట్ల శ్రీనివాస్ కోరారు. ఆయన బుధవారం ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై తన్నమాల, గొట్టిప్రోలు తదితర గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. గుడ్డ సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు రాజమణి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ నష్ట పరిహారం

కోట: మండలంలోని తీరప్రాంతమైన కొత్తపట్నంలో పరిశ్రమలకు భూములిచ్చిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లిస్తామని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. కొత్తపట్నంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో 446 ఎకరాల ప్రభుత్వ భూములకు నష్టపరిహారం కోసం రైతులు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. వీటిపై పూర్తిస్థాయిలో సర్వే చేపట్టాల్సి ఉందన్నారు. మూడు సర్వే బృందాలను నియమించామని, వారిచ్చే సర్వే రిపోర్టు ఆధారంగా నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, డీటీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

హైవే నిర్మాణానికి మోక్షం కల్పించడండి



నాయుడుపేట పట్టణ పరిధిలోని గోమతి సర్కిల్ వద్ద జాతీయ రహదారి

- కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ గురుమూర్తి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణ పరిధిలోని గోమతి సర్కిల్ నుంచి తుమ్మూరు వరకు ఉన్న 71వ నంబరు జాతీయ రహదారి వెళుతోంది. దీనిగుండా ప్రతి నిత్యమూ వందలాది వాహనాలు వెళుతూ ఉంటాయి. ఇక్కడ రహదారి చిన్నదిగా ఉండడంతోపాటు ఇరువైపులా ఆక్రమణలు పెరగడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. రోడ్డు విస్తరణ ఎంతో అవసరం ఉంది. దీనిపై గతంలో తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రత్యేక చొరవ తీసుకుని ఎన్‌హెచ్ అధికారులతో కలిసి సుమారు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. అంతే కాకుండా ఈ నెల 17వ తేదీ తిరుపతికి వచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి జాతీయ రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్

నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న మలుపు వద్ద చాంద్రాయి చెరువు కాలువపై ఉన్న వంతెన, తమ్మూరు గ్రామ సమీపంలో పాత చెక్‌పోస్టు వద్ద అన్నమేడు పంట కాలువపై ఉన్న వంతెన చాలా చిన్నవిగా ఉన్నాయి. పెద్ద వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఈ సమస్యను ఉన్నతాధికారులకు నివేదించడంతో రెండేళ్ల క్రితం సుమారు రూ.1.60 కోట్లతో రెండు చోట్ల వంతెన పనులు పూర్తి చేసి జాతీయ రహదారిని వెడల్పు చేశారు. అదే విధంగా గోమతి సర్కిల్ నుంచి తుమ్మూరు వరకు రహదారి విస్తరణ చేపట్టాల్సి ఉంది. ఇందులో భాగంగా రెండేళ్ల కిందటే ఎన్‌హెచ్ అధికారులు చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిని ఇరువైపులా ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు సైతం జారీ చేశారు. తర్వాత పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే ఈ రోడ్డును వదిలేసి గోమతి సర్కిల్ నుంచి తాళ్వాయిపాడు గ్రామం వైపు ఎల్‌ఏ సాగరం మీదుగా నాయుడుపేట పట్టణ పరిధిలో ఉన్న 16వ జాతీయ రహదారికి అనుసంధానం చేశారు. పనులు ఇంకా జరుగుతున్నాయి. పట్టణ పరిధిలో ఉన్న గోమతి సర్కిల్ నుంచి తుమ్మూరు వరకు ఉన్న 71వ నంబరు జాతీయ రహదారి పనులు చేపడితే పట్టణ ప్రజలకు అనుకూలంగా ఉంటుందని, పట్టణం కూడా విస్తరించే అవకాశం ఉంటుందని ఎంపీ గురుమూర్తి కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఇందులో భాగంగా ప్రతిపాదనలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు చేపట్టాలి



నాయుడుపేట పట్టణ పరిధిలో ఉన్న గోమతి సర్కిల్ నుంచి తుమ్మూరు వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు చేట్టాలి. రహదారి విస్తరణ పనులు జరిగితే పట్టణ ప్రజలకు చాలా సౌకర్యంగా ఉంటుంది. వాహనాలు కూడా సాఫీగా వెళతాయి. ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

– భాస్కర్ రెడ్డి, నాయుడుపేట

గతంలోనే ప్రతిపాదనలు పంపించాం

నాయుడుపేట పట్టణ పరిధిలోని గోమతి సర్కిల్ నుంచి తుమ్మూరు వరకు ఉన్న 71వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు చేసేందుకు గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతోపాటు అనుమతులు ఇచ్చిన వెంటనే పనులు చేపడతాం.

– సత్యమూర్తి, ఎన్‌హెచ్ డీఈ





నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు సమీపంలో విస్తరించిన వంతెన, నాయుడుపేట పట్టణంలో ఆక్రమణలతో కుంచుకుని పోయిన రహదారి

12 డిజిట్ల ఫేక్ కాల్స్‌తో జాగ్రత్త

సూళ్లూరుపేట / సూళ్లూరుపేట రూరల్: ఇతర దేశాల నుంచి వచ్చే 12 డిజిట్ల నంబర్లతో వచ్చే ఫేక్ కాల్స్‌తో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూళ్లూరుపేట ఎస్‌ఐ కె.రహీంరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. వాట్సాప్, టెలిగ్రామ్, స్కైప్ కాల్స్‌తో మీ పాప, మీ బాబు సైబర్ నేరాల్లో చిక్కుకున్నారని, డ్రగ్స్ కేసులో కూడా ఉన్నారని కాల్స్ వస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు పెడెక్స్ పార్శిల్ ఇతర దేశాలకు పంపించారని, వెంటనే మీరు సరెండర్ అవ్వాలని లేకుంటే అరెస్టు చేస్తామని బెదిరిపు కాల్స్‌తో మభ్యపెట్టి ఆధార్, ఫోన్ నంబర్లు, బ్యాంక్ ఖాతాలు, ఐటీ రిటన్స్ తదితర వివరాలు సేకరిస్తారని తెలిపారు. తర్వాత బ్యాంకు ఖాతాలను మొబైల్ నంబర్లను హ్యాక్ చేసి నగదును స్వాహా చేస్తారని హెచ్చరించారు. ఇండియన్ ఐపీఎస్ ప్రొఫైల్ పిక్స్‌ను సోషల్ మీడియాలో పెట్టుకుని మోసం చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా ఇతర దేశాల నుంచి ఇలాంటి కాల్స్ వస్తున్నాయని తెలిపారు. ఇలాంటి కాల్స్‌తో భయపడవద్దని, పోలీసులకు ఫిర్యాద చేయాలని సూచించారు.

అర్హులందరికీ పనులు కల్పించాలి



మాట్లాడుతున్న ఈసీ దామోదర్‌రాజు

దక్కిలి: మండలంలోని ఉపాధి జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100 రోజులు పనులు కల్పించాలని ఈసీ దామోదర్‌రాజు తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పనుల్లో అవకతవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూలీలకు గిట్టుబాటు వేతనం అందేలా కొలతల ప్రకారం పనులు చేయించాలన్నారు. కూలీల మస్టర్లను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం పంచాయతీల వారిగా కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు షఫీ, గిరి, సరిత, బీఎఫ్టీ శివయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సర్వే ప్రారంభం



భూములను సర్వే చేస్తున్న సిబ్బంది

చిల్లకూరు: మండలంలోని తీర ప్రాంతంలో చైన్నై–బెంగళూరు కోస్టల్ కారిడార్ కోసం సేకరించిన ప్రభుత్వ భూములను బుధవారం రెవెన్యూ అధికారులు సర్వే ప్రారంభించారు. చిల్లకూరు మండలంలో మొత్తం 914 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఇందులో ఇప్పటికే సుమారు 500 మంది రైతులకు వరకు వేరుశనగ, జీడిమామిడి, సవక, జామాయిల్ పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో భూములు సేకరిస్తే పరిహారం ఎంత ఇస్తారు అని అధికారులను రైతులు అడ్డుకోవడంతో భూసేకరణ పెండింగ్‌లో పడుతోంది. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టడంతో ఈ నెల 19వ తేదీన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ భూములను పూర్తిగా సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో నాలుగు బృందాలతో బుధవారం సర్వే చేపట్టారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా చిల్లకూరు, కోట మండలాల తహసీల్దార్‌లతో పాటు డివిజనల్ సర్వేయర్‌లు పర్యవేక్షించనున్నారు. అలాగే గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ నివేదికలను పరిశీలిస్తారని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

మేలుజాతి పశువులతో ఎంతో ఆదాయం



రైతులకు పశుగ్రాసం విత్తనాలు అందజేస్తున్న జేడీ రవికుమార్

దొరవారిసత్రం: కృత్రిమంగా మేలు జాతి పశువులను అభివృద్ధి చేసుకుంటే రైతులు అధిక లాభాలు పొందవచ్చని పశుసంవర్ధక శాఖ తిరుపతి జిల్లా జాయింట్ డైరెక్టర్ ఏ రవికుమార్ తెలిపారు. ఉచ్చూరులో బుధవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. పశు పోషకులకు పశుపోషణ, పాడి పరిశ్రమపై అవగాహన కల్పించారు. మేలైన యాజమాన్యం పద్ధతుల్లో మెళకువలు వివరించారు. జిల్లాలో పెయ్య దూడల ఉత్పత్తి పథకం ద్వారా మేలు జాతి పశువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించి 6,000 పశువులు అభివృద్ధి చేసేలా పనిచేస్తున్నామన్నారు. అనంతరం పశువులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. మేలు జాతి పశుగ్రాసాన్ని పొలాల్లో సాగు చేసుకునేందుకు విత్తనాలు పంపిణీ చేశారు. జిల్లా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సోమయ్య, ఏడీలు గోవర్ధన్‌రెడ్డి, ధనుంజయ, పశువైద్యాధికారిణి శ్రీదేవి, శ్రీనివాసులు, ఎంపీటీసీ వెంకటకృష్ణయ్య, సర్పంచ్ పద్మమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు జేఎస్‌పీ ఫౌండేషన్ ఉపకార వేతనాలు

చిల్లకూరు: తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ఇంటర్ తత్సమాన కోర్సులు చదివే బాలికలను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా జేఎస్‌పీ ఫౌండేషన్ ద్వారా యశస్వి ఎడ్యుకేషన్ ఉపకార వేతనాలు అందజేస్తున్నట్టు జిందాల్ పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. ప్రతి బాలికకు ఆ ఏడాది వచ్చిన మార్కుల ఆధారంగా ప్రోత్సాహక బహుమతి ఇస్తామని వెల్లడించారు. 16 నుంచి 30 ఏళ్ల లోపు వారు అర్హులని, రూ.2 లక్షలలోపు ఆదాయం ఉండాలని సూచించారు. ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.జేఎస్‌పీఫౌండేషన్.కామ్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు.

కారు చోరీ



చోరీకి గురైన కారు, బంకును పగులగొట్టిన దుండగులు



కారు చోరీపై ఎస్‌ఐ గోపికి ఫిర్యాదు చేస్తున్న మెకానిక్ యూనియన్ నాయకులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని డీఎస్‌ఆర్ కల్యాణ మండపం సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న మల్లారెడ్డి కారు మెకానిక్ షెడ్డులో ఉన్న కారు చోరీకి గురైంది. దీనిపై బాధితుడు మల్లారెడ్డి బుధవారం ఎస్‌ఐ గోపికి ఫిర్యాదు చేశారు. పెళ్లకూరు మండలం చావాలి గ్రామానికి చెందిన ప్రసాద్ తన కారును రిపేరు కోసం రెండు రోజుల క్రితం షెడ్డుకు తీసుకు వచ్చాడు. కొంత పని ఉండడంతో మంగళవారం కారును షెడ్డులో పెట్టి మెకానిక్ ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి చూడగా కారు లేదు. బంకు తాళాలు పగుల గొట్టి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు కారు చోరీకి పాల్పడినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారు విలువ సుమారు రూ.75 వేలకు పైగా ఉంటుందన్నారు. తరచూ బంకుల్లో చోరీలు జరుగుతున్నాయని, చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు కోరారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెంగాళమ్మ పరమేశ్వరికి బంగారు, వెండి కళ్లు బహూకరణ

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలో వెలసిన చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి పట్టణానికి చెందిన ఆములూరు రామ్‌ప్రతాప్‌నాయుడు, సుజాత దంపతులు బంగారు, వెండి కళ్ల బహూకరించారు. వాటిని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లుకు బుధవారం అందజేశారు. 8.100 గ్రాముల బంగారుతో రెండు కళ్లు, 9 గ్రాముల వెండితో మరో రెండు కళ్ల తయారుచేయించారు. మొక్కుబడి మేరకు వాటిని ఇచ్చినట్టు దాతలు తెలిపారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం



విద్యుత్ స్తంభాల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జనార్ధన్‌రెడ్డి

నాయుడుపేట టౌన్: పట్టణంలోని గాంధీపార్కు సమీపంలో విద్యుత్ స్తంభాల మరమ్మతు పనులు చేస్తున్నందున గురువారం సాయంత్రం వరకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం సాయంత్రం విద్యుత్ స్తంభాల మార్చే కార్యక్రమాన్ని పరిశీలించారు. పనుల వల్ల పట్టణంలోని బాలాజీ గార్డెన్, పాగొట్టం కాలనీ, ఎస్‌వీటీ వీధి, శంకరాపురం, గరిడీవీధి, బ్రాహ్మణవీధి, జైహింద్ కాలనీ తదితర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం వరకు నీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు. ఇన్‌చార్జి ఏఈ చంద్ర, నీటి సరఫరా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

నాయుడుపేట టౌన్: నడిచి వెళ్తున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును బుధవారం గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని పారిపోయిన ఘటన వెలుగు చూసింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కావమ్మ గుడి వీధిలో నివాసం ఉంటున్న వెంకమ్మ బుధవారం సమీపం బంధువులను ఆటో ఎక్కించి ఇంటికి నడిచి వస్తోంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి ఆమె మెడలో ఉన్న రెండున్నర సవర్ల (20 గ్రాములు) బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని విన్నమాల గ్రామ సమీపంలో జాతీయ రహదారి వద్ద బుధవారం ఉదయం ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు.. విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న లారీ నాయుడుపేట సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న మరో వాహనం ఓవర్‌టేక్ చేసి వెళ్లే క్రమంలో, దాన్ని తప్పించేందుకు లారీని పక్కకు తిప్పడంతో అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లి బోల్తా కొట్టింది. దీంతో లారీ నడుపుతున్న డ్రైవర్ హరి, క్లీనర్ పసుపతి స్వల్పంగా గాయపడి ప్రమాదం నుంచి బయట పడ్డారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరులో ఘనంగా జాతీయ సైన్స్‌డే



ఎన్‌ఎస్‌డీ-2024 బ్రోచర్‌ను విడుదల చేస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

సూళ్లూరుపేట: చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించి ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తిన ఇస్రో వైపు అన్ని దేశాలు చూస్తున్నాయని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పేర్కొన్నారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జాతీయ సైన్స్ డేను నిర్వహిస్తున్న నేపథ్యంలో రెండోరోజు బుధవారం గుంటూరులోని ఆర్‌వీఆర్, జేసీ కాలేజీల్లో ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నేషనల్ సైన్స్ డే (ఎన్‌ఎస్‌డీ)– 2024 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 ప్రయోగంలో భాగంగా చంద్రుని దక్షిణ ధృవంపై ల్యాండర్‌ను ఆగస్టు 23న విజయవంతంగా దించామని తెలిపారు. దీన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ ఆ రోజు చరిత్రలో గుర్తుండిపోయేలా ఆగస్టు 23న నేషనల్ సైన్స్ డేగా ప్రకటించారని తెలిపారు. భవిష్యత్తులో ఇస్రోకు యువ సైంటిస్టులు రావాలని, అందుకే నేషనల్ సైన్స్‌డే సందర్భంగా రాకెట్ సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నేటి తరం విద్యార్థులు ప్రయివేట్ ఉద్యోగాల వైపు ఎక్కువగా చూస్తున్నారని, ఇస్రోలో సైంటిస్టులుగా చేరి దేశానికి సేవచేసే భాగ్యాన్ని ఆస్వాదించడంతోపాటు కుటుంబాన్ని కూడా సమర్థవంతంగా పోషించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో షార్ నుంచి సైంటిస్టులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు



ఆక్రమణను అడ్డుకుంటున్న ఆర్‌అండ్‌బీ సిబ్బంది

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ రహదారులపై ఆక్రమణలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ రమణ హెచ్చరించారు. ఆయన బుధవారం నాయుడుపేట పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపు వీధిలో రోడ్డు పక్కన మురుగు కాలువలు దాటి ముందుకు వచ్చి నిర్మాణం చేపట్టిన వారికి హెచ్చరికలు జారీ చేశారు. గోమతి సర్కిల్ నుంచి పట్టణంలోని గాంధీ పార్కు వరకు త్వరలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయని, ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొగిస్తామన్నారు. పిచ్చిరెడ్డి తోపు వీధిలో ఓ దుకాణం వద్ద మురుగు కాలువను దాటుకుని నిర్మాణం చేపట్టిన సిమెంట్ పిల్లర్‌లను తొలగించాలని సూచించారు.

మంచి లక్షణాలు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ నరసింహారావు

తడ: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి లక్షణాలు అలవరుచుకోవాలని ఎస్‌ఐ నరసింహారావు తెలిపారు. మండలంలోని ఐటీఐ కళాశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్ల వల్ల జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. తల్లిదండ్రుల మాట విని చదువులపై దృష్టి సారించాలని చూరించారు. విద్యతోనే ఉన్నత స్థానాలు సాధ్యమన్నారు.

నేటి నుంచి మోమిడిలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

చిల్లకూరు: మండల తీర ప్రాంతంలోని మోమిడి గ్రామంలో గురువారం నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మోహన్, వినోద్, నాగరాజు, నిరీక్షన్ తెలిపారు. వారు మాట్లాడుతూ తమ స్నేహితులు శశికుమార్, శేషేంద్ర జ్ఞాపకార్థం పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విజేత జట్టుకు మొదటి బహుమతిగా రూ.40 వేలు, రన్నర్‌కు రూ.20 వేలు అందజేస్తామన్నారు. గెలిచిన జట్టుకు కప్పు బహూకరించడంతోపాటు మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ అందజేస్తామని వెల్లడించారు. వివరాలకు సురేష్, సునీల్, మణిని 63092 01106, 85007 72863, 85002 3080లో సంప్రదించాలన్నారు.

ఐటీఐలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తడ: మండలంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దేవదానం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉతీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు www.iti.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27వ తేదీన కౌన్సెలింగ్ ఉంటుందని, వివరాలకు 7993568224లో సంప్రదించాలని కోరారు.

హోరాహోరీగా అండర్–16 క్రికెట్ పోటీలు



125 పరుగులు తీసిన రోహన్, 3 వికెట్లు పడగొట్టిన దేవీచరణ్

వెంకటగిరి రూరల్: పట్టణంలోని తారకరామా క్రీడా ప్రాంగణంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్-16 విభాగం క్రికెట్ పోటీలు పోటాపోటీగా జరుగుతున్న మొదటి ఇన్నింగ్స్‌లో విశాఖపట్నం-విజయనగరం జట్ల మధ్య పోటీ జరిగింది. ఇందులో విశాఖపట్నం జట్టు 34 ఓవర్లకు 176 పరుగులు తీసి 3 వికెట్లను కోల్పోయింది. అనంతరం డే-2లో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన వైజాగ్ జట్టు నిర్ణీత ఓవర్లకు 493 పరుగులు చేసి 7 వికెట్లు కోల్పోయింది. ఈ జట్టులో రోహన్ 125 పరుగులు, గౌతమ్ 53 పరుగులు చేశారు. విజయనగరం జట్టులో దేవీచరణ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ దిగిన విజయనగరం జట్టు 24 ఓవర్లకు 36 పరుగులు తీసి 4 వికెట్లను కోల్పోయింది. మొత్తం 356 పరుగుల తేడాతో విజయనగరం జట్టు వెనుకబడింది.